క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

యాలాల: మండలంలోని బెన్నూరు ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాస ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే సోదరుడు, ఆర్పీఎల్ ఫ్యాక్టరీ ఎండీ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. పూజారులు ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శరణుభూపాల్, గురురాజ్ ఉన్నారు.

అన్నాభిషేకం అలంకరణలో శివయ్య



తాండూరు టౌన్ : శ్రావణమాసం ముగింపు కార్యక్రమంలో భాగంగా తాండూరు పట్టణంలోని శ్రీభావిగి భద్రేశ్వరస్వామి దేవస్థానంలోని శివాలయంలో శివుడు అన్నాభిషేకం అలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న జయకృష్ణ

బొంరాస్‌పేట: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మెట్లకుంటలో ఎనిమిది మందికి రూ.4లక్షల చెక్కులను పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అందజేశారు. తుంకిమెట్లలో ఇద్దరికి రూ.83వేల చెక్కులు మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు అనీఫ్‌మియా, పార్టీ నాయకుడు బాల్‌రాజ్‌గౌడ్ అందజేశారు. నాగిరెడ్డిపల్లిలో రూ.80వేల చెక్కు శ్రీనివాస్ అందజేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యతోనే భవిష్యత్
ఎంఈఓ చంద్రప్ప



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

బంట్వారం: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలంటూ ఎంఈఓ చంద్రప్ప ఆకాంక్షించారు. మంగళవారం ఆయన కోట్‌పల్లి మండలంలోని రాంపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు. అలాగే శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. విద్యార్థులను పాత భవనం దగ్గరకు వెళ్లకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని త్వరలోనే డిస్మెంటల్ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విశ్వేశ్వర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పాల్గొన్నారు.

తప్పులు చేయొద్దు
ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: ఓటరు జాబితాలో తప్పులు చేయొద్దని ఎంపీడీ విశ్వప్రసాద్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ..కుటుంబసభ్యులు అందరూ ఓకే వార్డుల్లో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆనంద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పార్ట్‌టైం ఉపాధ్యాయుల తొలగింపు అన్యాయం

తాండూరు టౌన్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులను అకస్మాత్తుగా తొలగించడం అన్యాయమని పలువురు ఉపాధ్యాయులు మంగళవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వర్తిస్తు న్న మమ్మల్ని ఎలాంటి నోటీసులు లేకుండా తొ లగించడం సమంజసం కాదన్నారు. ఈ సందర్భంగా టీజీ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్ అశోక్‌కు వినతిపత్రం సమర్పించారు.

పత్తాలేని ఫసల్ బీమా!

- ఏడేళ్లుగా నిలిచిన కేంద్ర పథకం
- లోపాలున్నాయని పక్కన పెట్టిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- ప్రకృతి విపత్తులతో నష్టపోతున్న అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



బాస్‌పల్లిలో సాగు చేసిన మొక్కజొన్న పంట(ఫైల్)

దోమ : ఆరుగాలం రైతులు కష్టపడి సాగు చేసిన పంటలు విపత్తుల కారణంగా నష్టపోతున్నా ప్రభుత్వాలు ఆదుకునేందుకు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు మృతి చెందితే రైతుబీమా అమలు చేసి కుటుంబాన్ని ఆదుకుంటుంది. కాని, రైతుసాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లితే సాయం అందించడం లేదు. కేంద్ర ప్రభుత్వం రైతులు సాగు చేసిన పంటలకు (పీఎంఎఫ్‌బీవై) పథకాన్ని అమలు చేస్తుండగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పథకంలో లోపాలున్నాయని పక్కన పెట్టింది.

దోమ మండలంలో పంటల సాగు వివరాలు

పంట	విస్తీర్ణం
వరి	13,200
పత్తి	2,470
కంది	2,335
మొక్కజొన్న	2,690
పెసర	970

పంట క్షేత్రం యూనిట్‌గా..

గతంలో ప్రభుత్వం అమలు చేసిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద మండలాన్ని యూనిట్‌గా తీసుకొని అంచనా వేసేవారు. అయితే వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల కారణంగా యూనిట్‌ను అంచనా వేయలేకపోతున్నారు. దీంతో రైతులకు లాభం చేకూరేలా లేదని గ్రహించారు. ఈ క్రమంలో పంటలకు నేరుగా బీమా సంస్థలు ఇన్సూరెన్స్ అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు దక్కని పరిహారం

గత ఏడు సంవత్సరాలుగా రైతులు సాగు చేస్తున్న పంటలు ప్రకృతి వైపరీత్యాలకు, సీజనల్ తెగుళ్ల కారణంగా పంటల దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయినా, ప్రభుత్వాలు రైతులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దోమ మండలంలో మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 13, 250 మంది రైతులు ఉన్నారు. ప్రధానంగా ఆయా గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర పంటలనుఎక్కువగా సాగు చేస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా తెగుళ్ల సోకి పంటలు నాశనం అవుతున్నా సందర్భాలు అనేకం ఉన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయే పంటలకు ఫసల్ బీమా పథకం కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బీమా అమలు చేయాలి



రైతులు సాగు చేస్తున్న పంటలకు ప్రభుత్వం ఫసల్ బీమా పథకం అమలు చేయాలి. రైతులు కష్టపడి అప్పులు తెచ్చి పంటలను సాగు చేస్తే విపత్తుల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లితోంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం రైతులకు ప్రీమియం చెల్లించి బీమా కల్పిస్తే ఎంతో మేలు చేకూరుతుంది.

– వెంకటయ్య, రైతు, బొంపల్లి

ప్రకృతి వైపరీత్యాలతో..



ప్రకృతి విపత్తుల కారణంగా రైతులు నానా అవస్థలకు గురవుతున్నారు. వివిధ రకాల పంటలను సాగు చేసినప్పటికీ అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నాశనం అవుతున్నాయి. దీంతో సాగు చేసిన రైతులు అప్పుల్లో కూరుపోయి చెల్లించలేని దుస్థితి నెలకొంటుంది. ప్రభుత్వం పంటల బీమా సౌకర్యం కల్పిస్తే రైతులకు వెసులుబాటు కలుగుతుంది.

– అర్జున్‌రెడ్డి, శివారెడ్డిపల్లి

ఎలాంటి ఆదేశాలు రాలేదు



పంటల బీమా పథకం పై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా పథకం గతంలో ప్రవేశపెట్టింది. గత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తప్పనిసరిగా రైతులకు ఫసల్ బీమా పథకం అందించేలా చర్యలు తీసుకుంటాం.

– ప్రభాకర్‌రావు, వ్యవసాయ అధికారి, దోమ

దారంతా బురదమయం



దౌలాపూర్ సమీపంలో చిత్తడిగా మారిన రోడ్డు



దుద్యాల్: గుంతల్లో కంకర వేస్తున్న టిప్పర్

యాలాల: ఎడతెరపిలేని వర్షాలకు తాండూరు–కొడంగల్ మార్గం అధ్వానంగా మారింది. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తాండూరు నుంచి లక్ష్మీనారాయణపూర్, దౌలాపూర్, తిమ్మాయిపల్లి, బండమీదిపల్లి మీదుగా రహదారి విస్తరణ పనులు సాగుతున్నాయి. గతంలో ఉన్న బీటీని తొలగించి మొరం, కంకర, డస్ట్‌తో రోడ్డు పనులు చేపడుతున్నారు. అయితే వర్షాలకు ఈ దారంతా బురదమయంగా మారింది. దీంతో ద్విచక్రవాహనదారులకు ప్రయాణం కత్తిమీది సాములా మారింది. వర్షం ఒక వైపు, చిత్తడిగా మారి జారుతున్న రోడ్డుతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో పలు చోట్ల కల్వర్టు నిర్మాణ పనులు సైతం చేపడుతున్నారు. అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.

ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు

దుద్యాల్: వర్షాలకు రోడ్లు ధ్వంసమై గుంతలుగా మారాయి. తాండూరు–మహబూబ్‌నగర్ అంతరాష్ట్ర రహదారి కావడంతో నిత్యం వేలల్లో వాహనాలు ప్రయాణాలు సాగిస్తుంటాయి. ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి ప్రయాణం ఇబ్బందిగా మారింది. దీంతో అప్రమత్తమైన అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. గుంతల్లో కంకర వేసి రోడ్డు రోలర్ సహాయంతో చదును చేశారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి



యాలాల: పీఆర్టీయూ మండల నూతన అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శిగా రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2024–26 పాలక సంవత్సరానికి కొత్త కార్యవర్గం ఏర్పటైంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సంఘం రాష్ట్ర, జిల్లా బాధ్యుల సమక్షంలో రేపు(గురువారం) ప్రకటించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు.

దౌల్తాబాద్ ఎంపీడీఓగా శ్రీనివాస్



దౌల్తాబాద్: దౌల్తాబాద్ ఎంపీడీఓగా శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ విజయలక్ష్మి మోమిన్‌పేట మండలానికి బదిలీ అయ్యారు. ఎంపీఓగా పని చేస్తున్న శ్రీనివాస్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించారు.

బడికి డీజేసౌండ్ సిస్టం అందజేత



డీజే సౌండ్ సిస్టం అందిస్తున్న నాయకులు

కుల్కచర్ల: ప్రభుత్వ బడుల ఉన్నతికి గ్రామస్తులు సహకారం సంతోషమని రాంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల కమిటీ చైర్మన్ మాధవి, ప్రధానోపాధ్యాయురాలు అనురాధ అన్నారు. మంగళవారం రాంరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు మాజీ ఉపసర్పంచ్ దామోదర్‌రెడ్డి సౌండ్‌సిస్టం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉపయోగకరమైన సహాయ సౌకర్యాలను అందజేయడంలో యువత, నాయకులు, ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నందిని, నాయకులు శేరిరాంరెడ్డి, విజేందర్‌రెడ్డి, గోపాల్, అశోక్, జంగయ్య, ఆంజనేయులు, మల్లేశ్, శ్రీనివాస్, బుగ్గయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోండి



బొంరాస్‌పేట: పీస్ కమిటీ సమావేశం

బొంరాస్‌పేట: వినాయక చవితి ఉత్సవాల్లో ఉత్సవ కమిటీలు శాంతిభద్రతలు పాటించాలని ఎస్సై ఎండీ.రవూఫ్ సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌వద్ద పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన వినాయక ఉత్సవ కమిటీల నేతలతో మాట్లాడుతూ.. మండపాలను ప్రత్యేక స్థలాల్లో ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఊరేగింపుల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని హెచ్చరించారు. అనంతరం కమిటీల అభిప్రాయాలు సేకరించారు. ఇందులో మండల నాయకులు జయకృష్ణ, రాజేశ్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులున్నారు.

ఇబ్బందులు కల్గించొద్దు

దౌల్తాబాద్: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్‌ఐ రవి గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండపాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. మండపాల్లో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా కార్యక్రమాలు చేపట్టవద్దని హెచ్చరించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసే మండపాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జనం చేసుకోవాలన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

కుల్కచర్ల: వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కుల్కచర్ల ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆయా గ్రామాలకు చెందిన యువజన సంఘాలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వినాయక ప్రతిమలను ఏర్పాటు చేస్తున్న యువజన సంఘాల ప్రతినిధులు అన్ని జాగ్రత్త తీసుకోవాలని అన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఆ పత్రాన్ని తమకు అందజేయాలన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, జిల్లా కార్యదర్శి అంజిలయ్య, పోలీసులు పాల్గొన్నారు.

బసిరెడ్డి చెరువుకు గండి



గండిని పూడ్చుతున్న జేసీబీ

కుల్కచర్ల: వరుస వర్షాలకు చెరువులు, కుంటలు నిండి పలుచోట్ల సమస్యలు తలెత్తాయి. మండలంలోని తిర్మలాపూర్ గ్రామ పరిధిలోని బసిరెడ్డిచెరువుకు గండి పడింది. ఈ విషయాన్ని స్థానికులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్ కనకం మొగులయ్యకు సూచించారు. స్పందించిన ఆయన ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చి, గండిని పూడ్చివేయించారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతుల ద్వారా ఇబ్బందులు రాకుండా చేసి, నీటి నిల్వలు తగ్గిన తరువాత శాఖపరమైన పనులు చేస్తామని అధికారులు తెలిపారు. వెంటనే స్పందించిన పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్యకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాఘవపూర్ వాసికి డాక్టరేట్



ప్రవీణ్‌కుమార్

పరిగి: మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన బొంపల్లి ప్రవీణ్ కుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయం, సామాజిక సేవల విభాగం నుంచి డాక్టర్‌రేట్ పొందాడు. 'ఏ సోషలాజికల్ స్టడీ ఆఫ్ హైదరాబాద్' అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. దీంతో ఆయనను పలువురు అభినందించారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

దోమ: ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు మాధవి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మండల వైద్యాధికారి రజితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా ప్రజల ఆరోగ్య సంరక్షణకు పని చేస్తున్న తమను ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనికి తగిన వేతనం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం అందించే జీతం దినసరి ఖర్చులకు సరిపోవడం లేదని, 26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని సౌకర్యాలను తమకు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాత విలవిల



మొలకెత్తిన పెసర పంటను చూపిస్తున్న రైతు



వరిపొలంలోకి కొట్టుకొచ్చిన ఇసుక దిబ్బలు

పొలంలోనే మొలకెత్తిన పెసర, ధ్వంసమైన పత్తి,వరి

దుద్యాల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు పండించిన పంటలు వరదలకు కొట్టుకుపోగా.. కొన్ని పొలంలోనే మొలకెత్తాయి. మండలంలోని కుదురుమల్ల గ్రామంలో పెల్కలి సాయిలు రెండు ఎకరాల్లో రూ.40 వేల పెట్టుబడితో పెసర పంటను సాగు చేశారు. కోతకు వచ్చిన పంటను కోద్దామనుకునే సమయానికి భారీ వర్షాలు కురవడంతో పొలంలోనే గింజలు మొలకెత్తాయి. దీంతో రూ. 1లక్ష 50వేల పంట నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అలాగే, అదే గ్రామానికి చెందిన కిష్టగాళ్ల లాలప్ప రెండు ఎకరాల పత్తి పంటను కౌలుకు సాగు చేశాడు. వర్షాలకు పంట మొత్తం నీటమునిగి నేల వాలిపోవడంతో లబోదిబోమంటున్నాడు. హస్నాబాద్ సమీపంలో వరద కారణంగా వరిపొలంలోకి ఇసుక దిబ్బలు కొట్టుకొచ్చి పంటకు నష్టం వాటిల్లింది. విషయం వ్యవసాయ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న పంటలను గుర్తించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొడంగల్ రూరల్ : మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ గ్రామశివారులోని గిరిజన గురుకుల విద్యాలయంలో మంగళవారం విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు 480మందికి కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. పరిసరాలతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థుల దూర దృష్టి, దగ్గర దృష్టిలను పరిశీలించారు. కంటి చూపు మందగించిన విద్యార్థులకు కంటి అద్దాలను అందించనున్నట్లు డాక్టర్లు శ్రీకాంత్, నాగేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎం ఎల్లమ్మ, స్కూల్ స్టాఫ్ నర్స్ అరుణ, విద్యాలయ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమకారుడిని ఆదుకోవాలి



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కార్యదర్శి

వర్షానికి కూలిన ఇల్లు

పెద్దేముల్: రాష్ట్ర సాధన కోసం కళాకారుడిగా ఉద్యమంలో పాల్గొన్న బండపల్లి గ్రామానికి చెందిన కేశవులు ఇల్లు వర్షానికి కూలిపోయింది. దీంతో తమను ప్రభుత్వం ఆదుకోవాలంటూ మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి రుస్తుంకు ఫిర్యాదు చేశాడు. స్పీకర్, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నాడు. ప్రస్తుతం తలదాచుకోడానికి ఇల్లు లేదని ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రుస్తుంకు చెప్పడంతో వర్షాలు తగ్గే వరకు ప్రభుత్వ బడిలో ఉండాలని చెప్పినట్లు కేశవులు వాపోతున్నాడు.

రైతులు ఆందోళన చెందొద్దు

మండల ఏఓ కొమరయ్య



వివరాలు నమోదు చేస్తున్న ఏఓ కొమరయ్య, రైతులు

తాండూరు రూరల్: రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దని తాండూరు మండల వ్యవసాయశాఖ అధికారి కొమరయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జినుగుర్తి గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రేషన్ కార్డులేకపోవడంతో మండలంలో 2500 మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రేషన్‌కార్డులు లేని వారి నుంచి కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు, పట్టాపాసు పుస్తకం, దరఖాస్తు ఫారంతో ఫ్యామిలీ గ్రూపింగ్ చేసి ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తామన్నారు. దీంతో రైతులకు త్వరలో రుణమాఫీ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీను, రైతులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు సౌకర్యాలు కల్పించాలి



నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

హిందూ ఉత్సవ కేంద్ర సమితి

తాండూరు టౌన్ : రానున్న గణేశ్ ఉత్సవాలకు పట్టణంలోని అన్ని వార్డుల పరిధిలో సౌకర్యాలు కల్పించాలని హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి ప్రధాన కార్యదర్శి పటోళ్ల నర్సింలు మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీ నుంచి నిమజ్జనం వరకు పట్టణంలో పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరాను కల్పించాలన్నారు. నిమజ్జనం రోజున భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. పట్టణం నుంచి నిమజ్జన ప్రాంతమైన కోకట్ కాగ్నానది వరకు గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమలోసమితి ఉపాధ్యక్షుడు బిర్కట్ రఘు, శ్రీకాంత్‌రెడ్డి, సభ్యులు నరేష్, కుమార్, వెంకట్, పరమేశ్వర్, నర్సింహ్మా, నరేష్ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న డీలర్, నాయకులు

కుల్కచర్ల: ఏకధాటిగా కురిసిన వర్షాలకు చౌడాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఎడ్ల లాలు, మంగలి గోపాల్‌లకు చెందిన ఇళ్లు కూలిపోయాయి. ఈ క్రమంలో మంగళవారం తహసీల్దార్ ప్రభులు సూచన మేరకు కొత్తపల్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ కాలురాంనాయక్ బాధిత కుటుంబానికి 25కిలోల చొప్పున రేషన్ బియ్యం అందజేశారు. ఇబ్బందికర పరిస్థితుల్లో స్పందించిన రెవెన్యూ అధికారుల పనితీరుపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రఘు, జంబుల అనంతయ్య, రామయ్య, రాంచంద్రయ్య, గోపాల్, అంజయ్య, నరేందర్ పాల్గొన్నారు.